# పిడికెడు కోరిక



## మల్లాది వెంకటకృష్ణమూర్తి

''మళ్ళీ ఎప్పుడు తిరిగి రాక'' అడిగింది కదంబం తన భర్త పునర్వసుని.

''పది రోజులు అవచ్చు''.

''ఏం వుద్యోగమండి? వెధవ వుద్యోగం మీది. సంవత్సరానికోసారి పది రోజులు కేంప్ వేసే బదులు నెలకో రోజు వెయ్యచ్చుగా?'' అడిగింది చిరుకోపంగా.

''నిజమే. ఆ సంగతి మా బాస్‌కి వెళ్లి చెప్పు''.

''సర్లెండి. ఆ దూర్వాసులవారికి నూ అన్నా కోపం, ఆ అన్నా కోపం''.

ఆ రోజు సాయంత్రం చెప్పాడు పునర్వసు తన భార్యతో.

''జాగ్రత్త. ఇళ కూడా వూళ్లో లేదు''.

ఇళ వాళ్లింట్లో పై భాగంలో అద్దెకుండే అమ్మాయి. ఆ ఇంట్లో ఇళ ఒక్కత్తే కదంబంతో ఫ్రెండ్లీగావుంటుంది.

పునర్వసుకి గౌహతికి బదిలీ అయి సంవత్సరన్నరవుతోంది. మొదటి సారిగా కేంప్‌కి వెళ్తున్నాడు.

''ఢిల్లీ వెళ్లగానే వుత్తరాలు రాస్తుంటారా లేక మర్చిపోతారా?'' అడిగింది కదంబం.

''రెండు రోజులకో వుత్తరం రాస్తుంటాను. సరా!''

''పోస్ట్ కార్డ్సు రాస్తే చాలు. ఇక్కడ ఎవరికి తెలుగు వచ్చి చచ్చింది కనుక. అదీగాక మీరు చిన్న వుత్తరాలే రాస్తారు''

రైల్వే స్టేషన్‌కి వెళ్లి భర్తకి స్వయంగా వీడ్కోలు చెప్పింది కదంబం. మరో పది రోజుల పాటు భర్తకి దూరంగా వుండడం బాధే అయినా తప్పదు.

పక్క స్టేషన్‌లో రైలు దిగేసాడు పునర్వసు. మరో అరగంటలో వచ్చిన రైలెక్కి సరాసరి కలకత్తా చేరుకున్నాడు. ఢిల్లీ వెళ్లలేదు అతను.

భర్త ఇంటి నించి బయలుదేరిన రెండ్రోజుల తర్వాత అతని ఆఫీస్ నించి అతని కొలీగ్స్ వచ్చి చెప్పారు ఎంతో బాధగా.

''వెరీ సారీ, మీవారు పోయారు''

''ఎలా?'' పిచ్చిదానిలా చూస్తూ అడిగింది.

''ఆయన వుంటున్న హోటల్‌కి అగ్ని ప్రమాదం జరిగి''

కదంబం ఘొల్లున ఏడుస్తూ అడిగింది-

''అయ్యయ్యో! చావు రాసిపెట్టి వుండేనా అంత దూరం వెళ్లారు? నేను ఢిల్లీ వెళతాను''.

''ఢిల్లీలో కాదు పోత, కలకత్తాలో!''

''కలకత్తా? నాతో ఢిల్లీ వెళ్తున్నానని చెప్పారే?''

''పది రోజులు శెలవ పెట్టి ఆయన కలకత్తా వెళ్లారు. ఆయన హోటల్ రిజిస్టర్‌లో ఇంటి చిరునామా బదులు ఆఫీస్ చిరునామా, ఫోన్ నంబర్ ఇవ్వడంతో పోలీసులు మాకు తెలియజేశారు'' చెప్పారు వాళ్ళు.

''శెలవు పెట్టా? ఆఫీస్ కేంప్ మీద వెళ్తున్నానన్నారే?''

''కేంపా? అలాంటిదేం లేదే?'' అంతా ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు.

ఇక దహనం చేయడానికి అతని శరీరంలో ఏం మిగిలిలేదు.

కుళ్లిపోతున్న ఆమెకి మరో విషయం ఇంకాస్త బాధకలిగించింది. ఆయనఒక్కడే కాదు, ఆ గదిలో మరో అమ్మాయితో వున్నాడు. ఆమెని హోటల్ రిజిస్టర్‌లో తన భార్యగా పేర్కొన్నాడు. ఆమె మాత్రం చావకుండా స్వల్ప గాయాలతో తప్పించుకుంది.

మర్నాడు ఓ కార్డు వచ్చింది ఆమెకి-తాను ఢిల్లీ క్షేమంగా చేరానని, పనయ్యాక వస్తానని. ఆ తర్వాత వరసగా మూడు కార్డులు వచ్చాయి - రోజు విడిచి రోజు-తను క్షేమమని, ఇంటికి తిరిగి రావాలని వుందని, కాని ఆఫీస్ పని అయ్యేదాకా వచ్చేందుకు వీల్లేదని. అవన్నీ కలకత్తాలోని ఆమె భర్త మరణించిన తర్వాత భార్యకు రాసినవే. ఎవరో తన భర్త మరణం గురించి తెలీక వాటిని ఢిల్లీ నించి రోజు విడిచి రోజు పోస్ట్ చేస్తున్నారని గ్రహించింది. అది పునర్వసు బాబాయ్ కొడుకు పని అయి వుంటుందని కూడా గ్రహించింది. కలకత్తాలో వుండి తనని మభ్యపెట్ట డానికి ఆ ఏర్పాటు చేసివుంటారు.

పునర్వసు కలకత్తాలో మరణించిన పద్నాలుగో రోజు మధ్యాహ్నం ఎవరో కాలింగ్ బెల్ నొక్కితే వెళ్లి తలుపు తెరిచింది కదంబం.

లోపలికి వచ్చిన ఇళ సామాను సర్దుతున్న కదంబాన్ని చూసి చెప్పింది సానుభూతిగా.

''వెరీ సారీ. మీ వారు కలకత్తాలో హోటల్‌లో పోయారటగా? ఎలా పోయారు? ఉదయమే పుట్టింటి నించి తిరిగివచ్చాను. మా వారు చెప్పారు.. ఏమిటలా చూస్తున్నారు? ఓ.... నా భుజాలు, చేతులు ఎలా కాలాయనా? మా అమ్మ వాళ్లింట్లో స్టవ్ అంటిస్తూంటే! ఆ మచ్చలు చాలా కాలం వుంటాయన్నారు డాక్టర్.. ఇంతకీ మీవారు ఎలా పోయారు?''

''గెటౌట్'' రౌద్రంగా అరిచింది కదంబం బయటికి చేతిని చూపిస్తూ.

●

